అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- రాలిన మామిడికాయలు, నేలవాలిన వరి
- ఆందోళన చెందుతున్న అన్నదాత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధితులు

శాయంపేట/హనుమకొండ సబర్బన్, మే 17 : అకాల వర్షాలతో ధాన్యం రైతులు ఆగమవుతున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. భీమదేవరపల్లి 4.0 మిల్లిమీటర్లు, వేలేరు 6.0, ఎల్కతుర్తి 5.0, కమలాపూర్ 6.0, హసన్‌పర్తి 2.0, ధర్మసాగర్ 24.0, కాజీపేట 4.0, హనుమకొండ 1.0, ఐనవోలు 37.0, పరకాల 35.0, దామెర 12.0, ఆత్మకూరు 39.0, శాయంపేట 21.0, నడికూడ 7.0మి.మీల వర్షం కురువగా జిల్లా వ్యాప్తంగా 14.0గా నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు. కాగా, కొద్ది రోజులుగా వర్షాలు పడుతూ ఉండడంతో శాయంపేట మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. ధాన్యాన్ని కాపాడేందుకు రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే, రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చినప్పటికీ రోజుల తరబడి కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వర్షాలకు ధాన్యం బస్తాలు తడిసిపోతున్నాయి. ప్రగతి సింగారం, వసంతపూర్, గంగిరేణిగూడెం తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున ధాన్యం తడిసిపోయింది. గురువారం రాత్రి భారీ వర్షం పడడంతో పాటు శుక్రవారం కూడా మబ్బులు ఉండడంతో రైతులు ధాన్యం బస్తాల

శాయంపేట : వర్షంతో తడిసిన ధాన్యం

ఐనవోలులో నేలకొరిగిన వరి

వద్దే కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. త్వరగా కొనుగోలు పూర్తికాక పోవడంతో తలకు మించిన భారంగా మారుతోందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేకపోవడం, పరదాలు ఇవ్వకపోవడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

సంగెం : మండలంలో శుక్రవారం గాలి దుమారంతో పాటు వానకు పంటలు నేలవాలాయి. మామిడి తోటల్లో కాయలు నేలరాలి పనికి రాకుండా పోయాయి. కోతకు వచ్చిన వరి గాలివానకు కిందపడిపోయి వడ్లు పొలాల్లో రాలాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

కాజీపేట స్టేషన్‌లో మునిగిన పట్టాలు

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్‌లో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ప్లాట్‌ఫాం మధ్యలోని రైలు పట్టాల పైకి వర్షం నీరు చేరుకుంది. దీంతో పాటు ప్లాట్ ఫారాలు కూడా తడిసి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పట్టాల మధ్య ఉన్న డ్రైనేజీల రంధ్రాలు మూసుకుపోవడంతో నీరు భారీగా చేరింది. ఆ సమయంలో ఎలాంటి రైళ్ల రాకపోకలు జరుగక పోవడంతో నష్టం జరుగలేదు. రైల్వే అధికారులు వెంటనే స్పందించి సిబ్బందితో యుద్ధ ప్రతిపాదికన ప్లాట్ ఫారం మధ్యలో మూసుకుపోయిన డ్రైనేజీల్లోని చెత్తా చెదారం తొలగించడంతో నీరు వెళ్లిపోయింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఐనవోలు : అకాల వర్షంతో చేతికి అందివచ్చిన పంట నీటి పాలైంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కల్లల్లో ధాన్యం తడిచి ముద్దయింది. మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈరు గాలులకు మామిడి కాయలు పూర్తిగా నేల రాలినట్లు రైతులు తెలిపారు.

కాశీబుగ్గ : నగరంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 14వ డివిజన్‌లోని ఎస్ఆర్‌నగర్, సాయిగణేశ్ కాలనీ, లక్ష్మీగణపతి కాలనీ, మధురానగర్, సుందరయ్య నగర్, 19వ డివిజన్‌లోని వివేకానంద కాలనీ, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ రోడ్డు నీటతో నిండాయి. అలాగే 20 డివిజన్‌లోని పద్మానగర్, శాంతినగర్ ప్రాంతాలు చెరువులను తలపించాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. బాటసారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యా రు. ఎస్ఆర్‌నగర్, సాయి గణేశ్ కాలనీల్లో ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. కార్పొరేటర్ తూర్పాటి సులోచన-సారయ్య వంద ఫీట్ల రోడ్డు కాల్వలోని చెత్తను తీసివేయడంతో కాలనీల్లోని వర్షపు నీరు తగ్గిపోయింది. కాగా, డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం వల్ల చినుకు పడితే కాలనీలు జలమయంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖానాపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

ఖానాపురం, మే 17 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో హక్కులు, అవకాశాలు, ఉద్యోగాల కల్పనపై పోరాడేది బీఆర్ఎస్ ఒక్కటేనన్నారు. ఈ నెల 22న నర్సంపేటలో జరుగనున్న పట్టభద్రుల ఓటర్ల సమావేశానికి మండలంలోని ఓటర్లంతా తరలిరావాలని కోరారు. సమావేశంలో మస్తాన్, ప్రవీణ్‌కుమా ర్, రమేశ్, అశోక్, దేవేందర్, పూర్ణచందర్, రాజశేఖర్, శ్రీనివాస్, సుమన్ పాల్గొన్నారు.

గీసుగొండలో..

గీసుగొండ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎఓస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని 15వ డివిజన్ ఇన్‌చార్జి దామోదర్ కోరారు. గొర్రెకుంట గ్రామంలో పట్టభద్రులతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే శాసన సభతో పాటు శాసన మండలిలో ప్రజల పక్షం పోరాటం చేయడానికి గొంతు ఉంటుందన్నారు. తెలంగాణ గొంతును నొక్కడానికి కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలయ్య, డివిజన్ అధ్యక్షుడు లవ్‌రాజు, నాయకులు ఉజ్వల్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

నర్సంపేట, మే 17 : ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించి కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని పార్టీ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగెల్లి వెంకట్‌నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సంపేటలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ పేరుతో ఓట్లు వేయించుకొని కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. దుశ్యంత్‌రెడ్డి, గోనె యువరాజ్, కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మ, ప్రసాద్, తిరుమల సదానందం, పాషా, రజిత, చంద్రమౌళి, పట్టణ ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్, క్లస్టర్ బాధ్యుడు బండి రమేశ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై సన్నాహక సమావేశం

దామెర, మే 17 : మండల కేంద్రంలోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో శనివారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పరకాల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కాగితాల శంకర్ శుక్రవారం తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పరకాల, నడికూడ, పరకాల పట్టణం, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం మండలాలు, గ్రేటర్ 15,16,17 డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, యూత్, మహిళా కమిటీల సభ్యులు, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు, సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు, పట్టభద్రులు హాజరుకావాలని కోరారు.

బైక్‌ల చోరీ నిందితుల అరెస్ట్

శాయంపేట, మే 17 : జల్సాలకు అలవాటు పడి బైక్‌లను చోరీ చేస్తున్న నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నారు. శాయంపేట పీఎస్‌లో ఏసీపీ వివరాలు వెల్లడించారు. శాయంపేట మండలం వసంతపూర్ గ్రామానికి చెందిన ముక్కెర సాయిచరణ్ కొంతకాలం నుంచి హైదరాబాద్ బోడుప్పల్‌లో ఉంటున్నాడు. అక్కడ భూక్యా ఆజాద్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి జల్సాలు చేస్తూ విలాసంతమైన జీవితం గడిపేవారు. డబ్బులు లేకపోవడంతో అక్కడ ఇంటి ముందు ఉన్న బైక్‌లను దొంగలించి, వసంతపూర్‌లో ఉన్న వారి బంధువులైన అవినాశ్, హరికృష్ణకు వాటిని ఇచ్చి ఇతరులకు విక్రయించేవారు. ఇలా బోడుప్పల్‌లో ఒక స్కూటీ, హోండా షైన్, పల్సర్ బైకులు చోరీ చేయగా, శాయంపేటలో స్కూటీని దొంగతనం చేశారు. బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు ఈ నలుగురిని పట్టుకున్నారు. దొంగలను పట్టుకునేందుకు కృషిచేసిన ఎస్సైప్రమోద్ కుమార్, పీసీ సాధన్, ఖలీద్, నరేశ్‌ను ఏసీపీ కిశోర్ కుమార్, సీఐ రంజిత్‌రావు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి, మే 17 : చింతగట్టు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు కేసీ క్యాంప్, రామారం, భీమారం, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల, హసన్‌పర్తి, చింతగట్టు, కోమటిపల్లి, నారాయణనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఐనవోలులో..

ఐనవోలు : ఐనవోలు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఒంటిమామిడిపల్లి, నాగపురం, లక్ష్మీపురం, వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, వనమాల కనపర్తి గ్రామాల్లో, బావుల దగ్గర ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాయంపేట : మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. మరమ్మతుల్లో భాగంగా శాయంపేట, గట్లకనిపర్తి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, మే 17 : గ్రూప్-1(ప్రిలిమ్స్), సివిల్స్ (ప్రిలిమ్స్)-24 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ తెలిపారు. గ్రూప్-1(ప్రిలిమ్స్) గ్రాండ్ టెస్ట్‌ను హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే, సివిల్ సర్వీస్(ప్రిలిమ్స్)-24 ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌ను ఈ నెల 23, 26, 28, 30, జూన్ 10, 12 తేదీల్లో హైదరాబాద్‌లోని సైదాబాద్ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థులు https://studycirlce.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-27077929, 24071178 నంబర్లలో సంప్రదించాలని ప్రసాద్ కోరారు.

మృతదేహం గుర్తింపు

గిర్మాజీపేట, మే 17 : సీకేఎం కళాశాల దగ్గరలోని చిన్నవడ్డేపల్లి చెరువులో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ మచ్చ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి చిన్నవడ్డేపల్లి చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు సిబ్బందితో అక్కడికి వెళ్లి మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

రైలు కింద పడి ఇద్దరి ఆత్మహత్య

ఖిలా వరంగల్, మే 17 : గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. వరంగల్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి ప్రకాశ్‌రెడ్డిపేట సమీపంలో ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో శివరాత్రి సురేశ్ తండ్రి పేరు కనకయ్య, బాలసముద్రం, హనుమకొండ చిరునామా ఉన్నట్లు తెలిపారు. మరో గుర్తు తెలియని వ్యక్తి హంటర్ రోడ్డులోని ఆర్వోబీ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ సిబ్బంది కథనం ప్రకారం.. సుమారు 40 ఏళ్ల వయసున్న వ్యక్తి జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఎడమ చేతిపై తెలుగులో రాజమ్మ, ఇంగ్లిష్‌లో కల్యాణి అని పచ్చబొట్టు ఉంది. రైల్వే అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాలను ఎంజీఎం మార్చురిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

కేవీకేలో స్వర్ణోత్సవాలు

కరీమాబాద్, మే 17 : దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 ఏళ్లయిన సందర్భంగా శుక్రవారం పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో స్వర్ణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారం నాలా సర్వే చేయాలి

గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, మే 17 : రెవెన్యూ రికార్డుల వివరాల ప్రకారం క్షేత్రస్థాయిలో నాలా సర్వే చేపట్టాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం నయీంనగర్ నాలా నిర్మాణ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. నాలా ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నందున నాలుగు రోజుల్లో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రెసిడెన్సీ పాఠశాల నుంచి డబ్బాల బ్రిడ్జి వరకు రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే పూర్తయిన వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలన్నారు. రిటైనింగ్ వాల్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. నాలా హద్దులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, ఆర్డీవో దత్తు, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, బల్దియా ఈఈ రాజయ్య, ఇరిగేషన్ ఈఈ ఆంజనేయులు, డీఈలు హర్షవర్ధన్, తహసీల్దార్ విజయకుమార్, స్మార్ట్‌సిటీ పీఎంసీ ఆనంద్ పాల్గొన్నారు.

నయీంనగర్ నాలా మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, మే 17 : భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నిరుద్యోగ మహిళలకు టైలర్, బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్‌పై 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాలు ఉండాలన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉండాలని, ఆసక్తి ఉన్నవారు 4 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలతో భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ) సంస్కృతి విహార్ టీటీడీసీ హసన్‌పర్తిలో ఈ నెల 20వ తేదీలోగా పేర్లు సమోదు చేసుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, కోర్సు మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు స్కిల్ ఇండియా సర్టిఫికెట్, టూల్ కిట్స్ ఇస్తామని, వివరాలకు 9704056522, 9849307873, 6281260878, 9949108934లో సంప్రదించాలని కోరారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, మే 17 : హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జీ సక్రు తెలిపారు. అభ్యర్థులు కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ సెక్రటేరియల్ అసిస్టెంట్, వెల్డర్(ఒక సంవత్సర కోర్సులు), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రూమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ టెక్నిషియన్(రెండు సంవత్సరాల కోర్సు)ల్లో 20 శాతం ఐఎంసీ ఫీజుతో సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో మొబైల్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సింగ్యాతండాలో కరెంటు కట్

మీటర్లు పెడితేనే కరెంటు ఇస్తామని చెబుతున్న అధికారులు

గీసుగొండ, మే 17 : మండలంలోని దస్రుతండా శివారులోని సింగ్యాతండాకు నాలుగు రోజులుగా కరెంటు రాకపోవడంతో తండా వాసులు అంధకారంలో మగ్గుతున్నారు. ఈ మేరకు తండా వాసులు కిరణ్, సమ్మయ్య, దేవుసింగ్ జేత్‌రాం, పూల్‌సింగ్, మోతీలాల్, బాలు శుక్రవారం తమ గోడును విలేకరులకు వెల్లడించారు. నాలుగు రోజులు క్రితం వర్షం కారణంగా షార్ట్ సర్క్యూట్‌తో తండాలో డీటీఆర్ కాలిపోయిందని తెలిపారు. కొత్త డీటీఆర్ అమర్చి కరెంటు ఇవ్వాలని ఏఈ, డీఈలను మొర పెట్టుకున్నా పట్టించుకోవడలం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో ఇంటింటికీ మీటర్లు పెట్టుకుంటేనే కరెంటు సరఫరా చేస్తామని విద్యుత్ అధికారులు అంటున్నారని తెలిపారు. కొంత సమయం ఇవ్వాలని చెప్పినా అధికారులు వినడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తండాకు కరెంటు వచ్చేలా చూడాలని కోరారు.

SVS GROUP OF INSTITUTIONS
BHEEMARAM-506 015, HANAMKONDA (Dist.)
(Approved by AICTE, New Delhi & Affiliated to JNTU, Hyd)
Phone No.: 9391949237
Email: info@svsit.ac.in, www.svsit.ac.in
WALK IN INTERVIEW
For Additional Faculty
On 18-05-2024 from 10.00 AM Onwards
Professors, Associate Professors & Asst. Professors
In the following Engineering/ MBA/ Pharmacy/ H&S Departments having Ph.d in relevant branches with First Class in PG
Qualifications & Pay as per AICTE Norms Attend along with all relevant Certificates, Aadhar & PAN Documents.
Sd/- SECRETARY

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

అకౌంట్స్ సెక్షన్‌లో 'ఆమె' హవా

- బడా కాంట్రాక్టర్లకే చెల్లింపులు
- చిన్న కంట్రాక్టర్లకు ముప్పు తిప్పలు

వరంగల్, మే 17 : బల్దియా అకౌంట్ సెక్షన్‌లో ఆమె హవా కొనసాగుతోంది. జేఏవోగా అకౌంట్ సెక్షన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సదరు అధికారిణిపై అనేక విమర్శలు వస్తున్నాయి. బిల్లుల చెల్లింపులు ఆమె అనుకున్న వారికే జరుగుతాయన్న ఆరోపణలు ఉన్నాయి. బడా కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేస్తూ చిన్న, చిన్న కాంట్రాక్టర్లను ముప్పుతిప్పలు పెడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంత కాలంలో బిల్లుల చెల్లింపుల జాబితా చూస్తే విషయం తెలుస్తుందని పలువురు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. రూ.5లక్షల వరకు ఉన్న బిల్లులు చెల్లించాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ వాటిని పెడ చెవిన పెట్టి పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రమే చెల్లిస్తున్నట్లు సమాచారం. అందులో ప్రతిసారి తనకు అనుకూలమైన ఇద్దరు, ముగ్గురు కాంట్రాక్టర్ల బిల్లులే చెలిస్తున్నట్లు తెలుస్తోంది దీనిపై కొద్ది రోజుల క్రితం కాంట్రాక్టర్లు సదరు అధికారికి వ్యతిరేకంగా నిరసన చేసిన విషయం తెలిసిందే.

కమిషనర్ క్లాస్

కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో వస్తున్న ఆరోపణలపై కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే క్యాంపు కార్యాలయంలో సదరు అధికారికి క్లాస్ తీసుకున్నట్లు విశ్వనీయ సమాచారం. బిల్లుల చెల్లింపుల్లో బల్దియా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఒకటి, రెండు ఫైళ్లు సిఫారసు చేస్తే దానికి తోడు ఆమె తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు చెందిన పదుల సంఖ్యలో బిల్లులలు చెల్లిస్తున్నట్లు సమాచారం. దీనిపై పలుమార్లు కమిషనర్ మందలించినప్పటికీ ఆమె తీరు మారడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

వ్యభిచారానికి అడ్డాగా లాడ్జిలు

సుబేదారి, మే17 : వరంగల్ నగరంలోని లాడ్జిలు వ్యభిచార అడ్డాలుగా మారాయి. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లోని లాడ్జీల యజమానులు అడ్డదారిలో సంపాదనకు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మైనర్లకు సైతం లాడ్జి గదులను అద్దెకిస్తున్నారు. కొన్ని లాడ్జిల్లో ఎలాంటి ఆధారాలు లేకున్నా అధిక డబ్బులు వసూలు చేసి గంటల లెక్కన అద్దెకిస్తున్నారు. హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో హనుమకొండ బస్‌స్టేషన్ ఆవరణలోని లాడ్జిల పాటు, మరికొన్ని ప్రాంతాల్లోని పోలీసులు రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. హనుమకొండ పరిసర ప్రాంతంలోని లాడ్జిని శుక్రవారం పోలీసులు తనిఖీ చేయగా ఓ బాలిక, యువకుడు, మరో లాడ్జిలో 34 ఏళ్ల మహిళ, 20 ఏళ్ల అబ్బాయితో పట్టుబడినట్లు తెలిసింది. మరో లాడ్జిలో కూడా రెండు జంటలు పట్టుబడగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలిసింది.

రూ. 1.30 లక్షల సొత్తు చోరీ

గిర్మాజీపేట, మే 17 : తాళం వేసి ఉన్న ప్లాస్టిక్ వస్తువుల దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ. 1.30 లక్షల సొత్తు చోరీ చేసినట్లు సీఐ తుమ్మ గోపి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌వీఎన్ రోడ్‌లో నివాసముంటున్న గుని శెట్టి రాజేశ్వరరావు సోదరులు నిర్వహిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల గోడౌన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వస్తువులను దొంగిలించినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్‌గా కృష్ణయ్య

హనుమకొండ చౌరస్తా, మే 17 : కాకతీయ యూనివర్సిటీలోని పీవీ నర్సింహారావు నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్‌గా గడ్డం కృష్ణయ్యను నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన రిజిస్ట్రార్ మల్లారెడ్డి నుంచి బాధ్యలు చేపట్టారు. ఈ మేరకు కృష్ణయ్యకు కేయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల